క్లుప్తంగా

రేపు శానంపూడిలో 'పల్లెపల్లెకు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్న సిద్ధం'

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ మండలం శానంపూడిలో ఆదివారం ఉదయం 9 గంటలకు పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయం ఏర్పాటు చేయాలి

● సీఎం వైఎస్ జగన్‌కు సర్పంచ్ వినతి

టంగుటూరు: ఒంగోలు నగరంలో శుక్రవారం పేదల ఇళ్ల పట్టాల పంపిణీకి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టంగుటూరు మండలం జయవరం సర్పంచి మల్లవరపు పేరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు మేదరమిట్ల భరత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ ఆధారిత గ్రామమైన జయవరంలో సచివాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. తమ వినతిపై సీఎం సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు.

నష్ట పరిహారం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న భూ యజమానులు

సీఎస్‌పురం (పామూరు): బెంగళూరు, కడప, విజయవాడ (బీకేవీ) గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు పరిహారం ఇప్పించాలని మండలంలోని ముసునూరు, ముండ్లపాడు, దర్శి తిమ్మక్కపల్లి రైతులు శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరాకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము భూములు సాగుచేసుకుంటే కుటుంబాన్ని పోషించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. పరిహారం కోసం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఎన్నోసార్లు తిరిగామని అయినా తమకు న్యాయం చేసి పరిహారం ఇప్పించలేదన్నారు. పరిహారం ఇవ్వకుండానే తమ భూముల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరగక పోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. దీనిపై తహసీల్దార్ నాగూర్ మీరా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన అసైన్‌మెంట్ భూముల రైతులకు పరిహారం ఇప్పించేలా తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

వైభవంగా కళ్యాణం

కురిచేడు: గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ కళ్యాణం మండలంలోని అన్ని ఆలయాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల కళాణం, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించారు.

నేటి నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు

త్రిపురాంతకం: శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదిత్యాధి నవగ్రహ, కాలభైరవ సహిత ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయాల చైర్మన్, ఈఓ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం ఆలయంలో ఈ నెల 28 ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా ప్రత్యేక పూజలు, శనివారం పౌర్ణమి రోజు ఉదయం గురువందనం, గోపూజ, దేవాలయ ప్రదక్షిణం, యాగశాల ప్రవేశం, కర్కరీ స్థాపన, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, ప్రధాన కలశ, క్షేత్ర పాలన, చతుషష్టి యోగిని, ఆదిత్యాధి నవగ్రహ, సర్వతోభద్ర మండప, ఆరాధనలు, నీరాజన మంత్ర పుష్పం, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, సాయం ఔపాసన, లక్ష్మీగణపతి హోమం, చతుర్వేద పారాయణం, దర్బారు సేవ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు, హోమాలు చేయనున్నారు. 28వ తేదీ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యంలో పాల్గొనాలని సుబ్బారావు, చెన్నకేశవరెడ్డి కోరారు.

కారును ఢీకొన్న ఆటో

కంభం: నీటి బబుల్స్‌తో వెళ్తున్న ఆటో వేగంగా వెళ్తూ కారును ఢీకొట్టడంతో పాటు పక్కనే ఆపి ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం కందులాపురం సెంటర్‌లో జరిగింది. ప్రమాదంలో కారు ఓ వైపు మొత్తం నుజ్జునుజ్జయింది. ఎవరిక ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కనీస కొలతలు తీయలేని మీకు ఉద్యోగాలెందుకు?

● టీఏలపై డ్వామా పీడీ ఆగ్రహం
● ఉలవపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉలవపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఉలవపాడు: 'పనులకు సంబంధించి పనుల కొలతల్లో ఇంత తేడాలు వస్తే ఎలా.. కనీస కొలతలు తీయలేని మీకు టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలెందుకు' అని డ్వామా పీడీ వెంకటరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉలవపాడులో గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ వేదిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కొలతల్లో తేడాలు రావడంపై ఆయన స్పందించారు. 'మీరు ఇంజినీరింగ్ చదివారా'? అని టీఏలను ప్రశ్నించారు. మరీ ఇంత దారుణంగా తేడాలు వస్తే ఎలా అన్నారు. ఉలవపాడు, చాగల్లులో రెండు పనులకు సంబంధించి కొలతల్లో తేడాలు ఉన్నాయని ఆడిట్ బృందం తెలియచేసినప్పుడు ఆయన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బోర్డులను ఏర్పాటు చేయలేదని తెలియచేశారు. ఈ మండలంలో ఏదైనా మాయాజాలం ఉందా మీ దగ్గర బోర్డులు అన్ని ఎలా మాయం అవుతున్నాయని అడిగారు. తాము పెట్టామని.. బట్టలు ఉతకడానికి తీసుకుని వెళుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్‌లు తెలియచేశారు. అన్ని గ్రామాల్లో తీసుకుని వెళితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలియచేశారు. పలు గ్రామాల్లో ముందు హాజరు వేయకుండా తరువాత హాజరు వేసి వారికి కూలీలు చెల్లించారని తెలియచేశారు. రైతులకు సంబంధించి పలువురి పొలాల్లో మొక్కలు లేనట్లు గుర్తించారు. ఉలవపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల బడితల వెంకటేశ్వమ్మ, రాజుపాలెం గ్రామానికి చెందిన వలంటీర్ అనూష పనులు చేశారని వారికి వేతనం చెల్లించినట్లు తెలిపారు. అలాగే పనులు చేసిన అంతా వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది నుంచి నగదు రికవరీ చేయాలని ఆదేశించారు. లేదంటే ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద నుంచి రికవరీ చేయనున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందం పలు అంశాలు తెలియచేశారు. గ్రామ సభలో వారికి చెప్పకుండా నాకు ఎందుకు ఇలాంటి కథలు చెబుతున్నారని ఆయన ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నించారు. వారికి ఒకటి నాకు ఒకటి ఎందుకు చెబుతున్నారన్నారు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. వారిని మందలించినా చివరకు ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సామాజిక తనిఖీలో లోపాలను చేయవద్దని, ఎలాంటి రికవరీలు పనుల్లో లేకుండా ఆయన ముగించారు. ఏపీడీ మృదుల, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, ఎంపీడీఓ విజయకుమారి, ఈఓపీఆర్డీ చెంచమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రసూల్‌తో పాటు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.




ఒంగోలులో శుక్రవారం సీఎం జగన్‌తో మంత్రి ఆదిమూలపు సురేష్ తనయుడు విశాల్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి, ఎంపీపీ ప్రకాశం

జగనన్న సురక్షతో కార్పొరేట్ వైద్యం



మెడిసిన్ కిట్లను అందజేస్తున్న డాక్టర్లు, నాయకులు



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు



పైడిపాడులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రేష్మి



సోమరాజుపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ సరోజనమ్మ



వలేటివారిపాలెం: గర్భిణులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలందరికీ అందుబాటులోనే కార్పొరేట్ వైద్యం అందుతోందని డాక్టర్ యం.ప్రవీణ, డాక్టర్ షేక్ రుబీనా అన్నారు. మండల కేంద్రమైన పామూరు స్థానిక 3వ సచివాలయం పరిధిలోని ఆల్ఫా స్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యం, విద్యారంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కలను సాకారం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ రుబీనా, డాక్టర్ యం.ప్రవీణ, డాక్టర్ శ్రీహర్ష, నాగరాజు 516 మందికి సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, కంటి సంబంధిత సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పేషెంట్లకు మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కంటికి సంబంధించి 6 మందికి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. పీఎస్ నీలం బ్రహ్మయ్య, సయ్యద్ ఖాజా షరీఫ్, హెచ్‌ఈవోలు యన్.బ్రహ్మానందం, పెరుగు మురళి, ఎంఎల్‌హెచ్‌పీ పి.సుబ్బరాయుడు, ఎస్.మౌనికా రెడ్డి, సునీత, డీఈఓ పోకల రాజమోహన్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసీపల్లి: జగనన్న సురక్ష -2 కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు ఎన్. యషిత, ప్రద్యుష్ కిరణ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వెంగళాయపల్లిలో జగనన్న సురక్ష ఫేజ్ -2 కార్యక్రమం నిర్వహించారు. 372 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారని, వీరిలో 20 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించామన్నారు. సీహెచ్ఓ లక్ష్మీ సుజాత తదితరులున్నారు.

ప్రజల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు

సింగరాయకొండ(మర్రిపూడి): ప్రజల ముంగిటకే మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని సర్పంచ్ యన్నాబత్తిన సరోజనమ్మ పేర్కొన్నారు. సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరం నిర్వహించారు. 363 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు సీనియర్ డాక్టర్ దీరేంధర్ కుమార్ తెలిపారు. డాక్టర్లు సూచించిన మందులను పోస్టల్ ద్వారా రోగి ఇంటికి ఉచితంగా పంపే బృహత్తర కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ వంశీధర్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ జి.కృష్ణ కావ్య, ఎముకలు, కీళ్ల స్పెషలిస్టు డాక్టర్ కిరణ్ కుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి: మండలంలోని పైడిపాడు గ్రామంలో శుక్రవారం కామేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.రేష్మి ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 54 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యం

వలేటివారిపాలెం: మండలంలోని బడేవారిపాలెం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష-2 కార్యాక్రమం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ తెలిపారు. వలేటివారిపాలెం డాక్టర్ మణిదీపిక మాట్లాడుతూ 516 మందికి ఓపీలు చూసినట్లు పేర్కొన్నారు. 516 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఎంపీపీ మౌనిక అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో జెడ్పీటీసీ భారతి, స్పెషలిస్ట్ డాక్టర్లు ధర్మతేజ, రమ్య, స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి శివసిద్ధప్ప, సూపర్‌వైజర్ సునీత, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై శిక్షణ



గుడ్లూరులో పల్స్ పోలియో కార్యక్రమంపై మాట్లాడుతున్న మారుతిరావు



జరుగుమల్లిలో శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

గుడ్లూరు: మండలంలో మార్చి 3వ తేదీ జరగనున్న పల్స్ పోలియోపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మారుతిరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 0–5 సంవత్సరాల్లోపు 450 మంది పిల్లలకు, 35 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేస్తామన్నారు. వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. సీహెచ్ఓ భాస్కర్‌రావు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి

జరుగుమల్లి : పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని మార్చి 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జరుగుమల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కావ్య, కావ్యశ్రీ సూచించారు. జరుగుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై వైద్య ఆరోగ్య సిబ్బందికి, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,626 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ వెంకటేశ్వరరావు, హెచ్‌వీ తిరుపతమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సూచనలు పాటించాలి



పెద్దముప్పళ్లపాడులో తెగుళ్లపై సూచలిస్తున్న అంజలి

హనుమంతునిపాడు: పండ్ల తోటలు, కూరగాయ తోటల రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కనిగిరి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి అంజలి అన్నారు. శుక్రవారం ముప్పళ్లపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో చిన్నముప్పళ్లపాడు, పెద్ద ముప్పళ్లపాడు గ్రామాల్లో సాగు చేసిన కూరగాయ తోటలు, నిమ్మతోటలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నిమ్మ సాగులో ఆకు ముడత, పేను బంక, వేరు కుళ్లు, ఎండుపుల్ల తెగులు, కాయకు మంగు, గజ్జి తెగుళ్లనట్లు గుర్తించారు. నివారణకు పలు సలహాలు ఇచ్చారు.

దాతల సహకారం అభినందనీయం



దాతలు ఇచ్చిన వస్తువులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పీసీపల్లి: విద్యాభివృద్ధి దాతల సహకారం అభినందనీయమని హెచ్ఎం అంజనీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి, నేవీలో ఉద్యోగం చేస్తున్న చీమలదిన్నె మనోజ్ రూ.13వేల విలువ చేసే మినీ వాటర్ ఫిల్టర్ తల్లిదండ్రులు చీమలదిన్నె మాలకొండయ్య , నారాయణమ్మ చేతుల మీదుగా అందించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేసరి వెంకటరెడ్డి, ధనలక్ష్మి కుమారులు ప్రణీత్ రెడ్డి, ప్రతీక్ రెడ్డి విద్యాసామగ్రి అందజేశారు. పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్సై లక్ష్మణరావు శుక్రవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. మండలంలోని దప్పళంపాడు, గుండ్లపాలెం గ్రామాల పరిధిలో ఉన్న మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు తన సిబ్బందితో కలిపి దాడులు చేసి దప్పళంపాడులో రెండు, గుండ్లపాలెంలో రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శ్రీకోదండరామస్వామి దేవస్థానం నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న దాతలు

కందుకూరు రూరల్: మండలంలోని విక్కిరాలపేట గ్రామంలో నిర్మించనున్న శ్రీకోదండరామస్వామి దేవస్థాన నిర్మాణానికి టంగుటూరు వాస్తవ్యులైన సొంపల్లి కోటేశ్వరరావు–ప్రసూన దంపతుల కుమారులైన మురళి, శశిలు కలిపి స్వగ్రామమైన విక్కిరాలపేటలో నిర్మించనున్న దేవస్థానానికి శుక్రవారం రూ.3,00,116 విరాళంగా అందజేశారు. ఈ నగదును ఆలక కమిటీ సభ్యులకు అందించారు. కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి



ఉలవపాడులో బీఎల్‌ఓల ర్యాలీ

ఉలవపాడు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ రవిబాబు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు తెలియచేయాలని తెలిపారు. ఇప్పటికీ ఓటు హక్కులేనివారు 6ఏ ద్వారా నమోదు చేసుకోవాలని తెలియచేశారు. స్వీప్ 2024 కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎంపీడీఓ విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ వీరయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. శనివారం కల్యాణోత్సవం, హంసవాహనం, ఆదివారం సింహవాహనం, సోమవారం శేష వాహణం, మంగళవారం హనుమంత వాహనం, బుధవారం గరుడవాహనం, గురువారం గజ వాహనం, శుక్రవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ రావు, ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. తర్లుపాడుతో పాటు నాయుడుపల్లి, మీర్జపేట, గొల్లపల్లి, తాడివారిపల్లి, నాగేళ్లముడుపు, తుమ్మలచెరువు తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రమణాచారుల్యు, భార్గవరామాచార్యులు, వంశీకృష్ణాచార్యులు, రమణ్యులు శాస్త్రోక్తంగా క్రతువులు నిర్వహించారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లను అందజేస్తున్న వైద్యాధికారులు

లింగసముద్రం: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమం కింద స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను వైద్యాధికారి డాక్టర్ రమేష్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ శ్రీమన్నారాయణ శుక్రవారం అందజేశారు. మండలంలోని 13 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి అందజేశారు. క్షయ వ్యాధితో బాధపడుతున్నవారు మంచి ఆహారం తీసుకుంటే వ్యాధినిరోధకశక్తి పెరిగి టీబీ నుంచి కోలుకోవచ్చన్నారు. సీహెచ్ఓ జి.శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 3.40 కోట్లతో అభివృద్ధి పనులు



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఏఈ

కనిగిరి రూరల్: జలజీవన్ మిషన్ కింద మండలలో రూ. 3.40 కోట్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. 25 పంచాయతీల్లో సుమారు రూ. 15 నుంచి రూ. 20 లక్షలతో పనులు జరుగుతున్నాయి. శుక్రవారం బల్లిపల్లి పంచాయతీలోని గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముక్కర శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈ శ్రీకాంత్ మాట్లాడుతూ జేజేఎం కింద ప్రతి ఇంటికి నీటి కుళాయి అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. స్థానికంగా నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో డీప్ బోర్‌వెల్ వేసి.. అక్కడి నుంచి పైప్ లైన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి అందిస్తామన్నారు. ఇప్పటికి మండలంలో 65 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం జేజేఎం కింద అమలు చేస్తున్న పథకం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఏఈ వెంట సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు కోటం శెట్టి మోహన్‌రావు, వార్డు సభ్యులు, తదితరులున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోండి



పెద్దగొల్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సందీప్ అన్నారు. శుక్రవారం ఆయన పెద్దగొల్లపల్లి హెల్త్ క్లీనిక్ పరిధిలో కుడుముల కుంటా, పెద్దగొల్లపల్లి గ్రామాలోని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వ్యాధలుతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికీ వైద్య సేవలు అందించాలనే మంచి లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు చేశారు. సచివాలయ పరిధిలో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు. అక్కడ ఎంఎల్‌హెచ్‌పీని నియ మించారు. డాక్టర్ సందీప్, ఆరోగ్య సిబ్బంది. ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి: విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 14వ తేదీలోగా ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఫొటోలతో సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. నెట్ సెంటర్ లేదా ఎంఈఓ కార్యాలయంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.